క్లుప్తంగా

అక్రమంగా మట్టి తరలింపుపై అధికారులకు ఫిర్యాదు



గుట్ట నుంచి మట్టి తరలిస్తున్న టిప్పర్లు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని గుట్ట ప్రాంతాల నుంచి నాలుగు రోజులుగా టిప్పర్లతో అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను ఆదివారం టీఆర్ నగర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. సోమవారం కూడా అక్రమ మట్టి తరలిస్తుండడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. నర్సింగాపూర్ శివారులో ఉన్న గుట్టలు ఇప్పటికే గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళల్లో భారీగా మట్టి తరలిస్తున్నారు. దీంతో గుట్టలు ఖాళీ ప్రదేశాలుగా మారాయి.

గోదావరి పరిశుభ్రం



చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ధర్మపురి: ధర్మపురి గోదావరిలో సోమవారం స్పెషల్ డ్రైవ్ కింద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో కమిషనర్ రమేశ్ తమ సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని చేపట్టారు. గోదావరిలో పేరుకు పోయిన చెత్తా చెదారం, చిరిగిన దుస్తులు, కొబ్బరి ముక్కలు, పిచ్చి మొక్కలు, ముళ్ల కంచెలను తొలగించారు. పుష్కరఘాట్‌ల వద్ద పేరుకు పోయిన బురదను తొలగించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

కథలాపూర్: సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ మేడిపెల్లిలో ఎంఈవో నరేశంకు సోమవారం ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగులకు రూ. 25 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. డిమాండ్లు నెరవేర్చేవరకు దశలవారిగా ఉద్యమాలు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగ జేఏసీ నాయకులు బర్ల నారాయణ, చంద్రశేఖర్, రాధ, మహేశ్, రమేశ్, రాజు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య దినోత్సవం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 14న నిర్వహించనున్న ఆరోగ్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి కార్యాలయంలో సోమవారం ఆరోగ్య దినోత్సవంపై నియోజకవర్గంలోని సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

'నిరుపేదల సమస్యలు విస్మరించిన బీఆర్ఎస్'

రాయికల్: నిరుపేదల సమస్యలను బీఆర్ఎస్ విస్మరించి దశాబ్ది ఉత్సవాలను నిర్వహించుకోవడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మహంకాళి రాజన్న అన్నారు. సోమవారం రాయికల్‌లో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులు, నిరుపేదలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని విస్మరించి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల కొండయ్య యాదవ్, శ్రీధర్, లక్ష్మణ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

మారనున్న మోడల్ స్కూల్ రూపురేఖలు

- పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పెగడపల్లి మోడల్ స్కూల్
- విద్యార్థులకు సకల సౌకర్యాలు
- అందుబాటులో డిజిటల్ బోధన అత్యాధునిక లైబ్రరీ సౌకర్యం



పెగడపల్లి మోడల్ స్కూల్

పెగడపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ రూపు రేఖలు మారనున్నాయి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం శ్రీ' పథకానికి మోడల్ స్కూల్ ఎంపికైంది. ఈ పథకంలో ఎంపికైన పాఠశాలలను బలోపేతం చేయడం, కార్పొరేట్ తరహాలో విద్యను అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం, ప్రత్యేక నిధులు కేటాయించనుంది. ఈ పథకం అమలులో భాగంగా పాఠశాలకు అన్ని హంగులు కల్పిస్తారు. బడులను హరిత పాఠశాలలుగా అభివృద్ధి చేస్తారు. సోలార్ ప్యానళ్లు, ఎల్ఈడీ లైట్లు. ప్లాస్టిక్ రహిత వ్యర్థపదార్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పోషకాహార తోటల పెంపకం, పర్యావరణ పరిరక్షణ చర్యలు తదితర వాటిని కేంద్రం అమలు చేయనుంది. డిజిటల్ బోధనా శాస్త్రాన్ని ఉపయోగించడం కోసం ఐసీటీ, స్మార్ట్ క్లాసులు రూంలు, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కానున్నాయి. పాఠశాలలో వంద శాతం సైన్స్, గణితం కిట్లు అందుబాటులో ఉంటాయి. ఆయా సౌకర్యాల కోసం కేంద్రమే నిధులను ఖర్చు చేయడం, 5 ఏళ్ల పాటు పథకం అమలులో ఉండటంతో పాఠశాల దిశ మారనుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఎంపికవ్వడం గర్వంగా ఉంది



పెగడపల్లి ఆదర్శ మోడల్ స్కూల్ 'పీఎం శ్రీ' పథకానికి ఎంపికవ్వడం మా గ్రామానికి ఎంతో గర్వకారణం. ఇప్పటికే పాఠశాల బలోపేతానికి ప్రభుత్వం మన ఊరు–మన బడి ద్వారా అన్ని హంగులు కల్పిస్తోంది. పీఎం శ్రీ పథకానికి ఈ పాఠశాల ఎంపికలో హెచ్ఎం, ఉపాధ్యాయుల కృషి ఉంది. కేంద్రం నుంచి వచ్చే నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటాం.

– మేరుగు శ్రీనివాస్, సర్పంచి పెగడపల్లి

పాఠశాల మరింత అభివృద్ధి



కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న 'పీఎం శ్రీ' పథకంలో మా మోడల్ స్కూల్ ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుంది. 'పీఎం శ్రీ' పథకంలో ఏర్పాటు చేసే సౌకర్యాలను పూర్తి స్థాయిలో వాడుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తాం. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఉంటే విద్యా బోధన కూడా సులువుగా ఉంటుంది.

– సుంకరి రవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

అంగన్‌వాడీల్లో పిల్లలను చేర్పించాలి



దోమలకుంటలో గర్భిణులకు సీమంతం

కథలాపూర్: మండలంలోని దుంపేట, సిరికొండ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, పౌష్టికాహారంతోపాటు ఆట, పాటలతో బోధన అందిస్తామని టీచర్లు పేర్కొన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్లు సునిత, నాగమణి, సువర్ణ, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మేడిపెల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో ఇంటింటికి వెళ్లి అంగన్‌వాడీ టీచర్లు చిన్న పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని సోమవారం ప్రచారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం, విద్యను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాధవి, సరిత, రమ్య పాల్గొన్నారు.

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరీ కోరారు. అంగన్‌వాడీ బడి బాటలో భాగంగా సోమవారం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు చేపట్టారు. పెగడపల్లిలో కిషోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. దోమలకుంట, బతికపల్లిలో గర్భిణులకు సీమంతం జరిపించారు. సుద్దపల్లిలో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, సుష్మ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం, యూసుఫ్‌నగర్, కల్లూర్, సర్పరాజ్‌పూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం బడిబాట చేపట్టారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పర్యావరణ ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షమీమ్ సుల్తానా, షైని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



దమ్మన్నపేటలో నిర్వహిస్తున్న బడిబాట

ధర్మపురి: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. మండలంలోని దమ్మన్నపేట, జైనా, దొంతాపూర్, దోనూర్, నక్కలపేట తదితర గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు బ్యానర్లు చేతబట్టి వాడవాడలా ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లాపూర్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యనందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంఆర్పీ సీఆర్పీ దేవారెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్, ముత్యంపేటలో నిర్వహించిన బడి బాటలో పాల్గొని మాట్లాడారు. సువిశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతావరణం, అంకిత భావం, శిక్షణతో కూడిన విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయ బృందం కలిగిన ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారులను, బడీడు పిల్లను చేర్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలపేతానికి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, ఉపకార వేతనాలను అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, రాధ, శ్రీలత, జ్యోతి, పద్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



జగిత్యాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, ఉద్యోగులు

కోరుట్లటౌన్: పర్యావరణం కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, మహిళా సంఘాలకు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి, పెంచాలని తెలిపారు. మొక్కలు పెరిగితేనే పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు.

మహిళలకు జ్యూట్ బ్యాగులు పంపిణీ

పట్టణంలో ప్లాస్టిక్ వాడకం నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ పేర్కొన్నారు. 31 వార్డులో మహిళా సంఘ సభ్యులకు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. బట్ట సంచులనే వాడి, పర్యావరణం కాపాడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెండెం గణేశ్, అధికారులు మహేశ్, ప్రవీణ్, మెప్మా సీవో శివకుమార్, ఆర్పీ గంగమణి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం రోజువారి జీవితంలో సాధ్యమైన అన్ని మార్పులు తీసుకువస్తే పర్యావరణం పరిరక్షించవచ్చన్నారు. పర్యావరణం పరిరక్షించేందుకు నిరంతరం ప్రతీ ఒక్కరిని ప్రేరేపించేందుకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గంగాధర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్లాపూర్: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గుండంపల్లిలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఓన్లీ వన్ ఎర్త్ థీమ్‌తో ముందుకొచ్చి పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు కలిసికట్టుగా ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దనరేకుల మల్లు, పంచాయతీ కార్యదర్శి సోముల నారాయణరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మెట్‌పల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే హరితహారంలో ప్రజలు భాగస్వాములై పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మి, సిబ్బంది రత్నాకర్, అరుణ్‌కుమార్, నరేశ్, ఉమా, విజయ్, విష్ణు, ముజీబ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

'భారత్ బచావో' సదస్సును విజయవంతం చేయాలి



వర్షకొండలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: జగిత్యాలలో ఈ నెల 10న నిర్వహించే భారత్ బచావో జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జెఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. మండలంలోని వర్షకొండలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని సమూలంగా నిర్వీర్యం చేసే విధంగా కుట్రలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరిని ఎండకట్టాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి గుజ్జెరి ప్రకాశ్, మండల నాయకులు బోయిని వెంకటేశ్, నర్సయ్య, తుటికుర్ల నాగరాజు, ఎండీ నాజీర్, దొస ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లాపూర్: జిల్లా కేంద్రంలో ఈ నెల 10న నిర్వహించే భారత్ బచావో సదస్సును విజయవంతం చేయాలని ప్రజాసంఘాల జేఏసీ కార్యనిర్వహక రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు రేగుంటలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి చలో జగిత్యాల కరపత్రాలను ఆవిష్కరించారు .సదస్సుకు దళిత, గిరిజన, బహుజనులందరూ పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు చెన్న విశ్వనాథం, మహ్మద్ షేక్ హుస్సేన్, భారత జాగృతి యువత జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్, భారత్ బచావో జిల్లా కో–ఆర్డినేటర్ పిట్టల నారాయణ, సర్పంచ్ కుందేల్ల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ



కొక్కుల శ్వేత

వెల్గటూర్: మండల నూతన ఎస్సైగా కొక్కుల శ్వేత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు పని చేసిన నరేశ్ కుమార్‌ను జగిత్యాల వీఆర్ కు బదిలీ చేయగా, కథలాపూర్‌లో విధులు నిర్వహిస్తున్న శ్వేత బదిలీపై వెల్గటూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై శ్వేత మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎస్సైకి సిబ్బందిశుభాకాంక్షలు తెలియజేశారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలి

సారంగాపూర్: ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలని బీజేపీ బీర్‌పూర్ మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. రోహిణి కార్తె ముగింపునకు వచ్చినా.. కొనుగోళ్లు పూర్తి చేయక పోవడం ఏమిటని ప్రశ్నించారు. వరి సాగు పెరగడానికి ఇతర పంటలకు నిలకడ ఉండే ధర, ఇతర పంటలకు గిట్టుబాట ధర రాక రైతులు వరి పంటవైపు దృష్టిసారించారని అన్నారు. దీనికి తెలంగాణ ప్రభుత్వ ఘనతా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు మ్యాడ జనార్ధన్, రైతులు, నాయకులు ఉన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మల్లాపూర్: సమగ్ర శిక్షా (ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) మండల అధ్యక్షుడు ఎగ్యారపు వెంకటేశ్ అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో సమగ్ర శిక్షణ కాంట్రాక్ట్ ఉద్యోగుల పోరాటానికి ఎస్టీయూ యూనియన్ మద్దతు ఇవ్వాలని ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ యూనియన్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ప్రతాప్, దేవారెడ్డి, విజయప్రసాద్, నరేశ్‌పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన తహసీల్దార్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: ఆర్డీవోగా పదోన్నతి పొందిన మండల తహసీల్దార్ మహేశ్వర్‌ను సోమవారం డిప్యూటీ తహసీల్దార్ పద్మ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రమేశ్, గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ అనురాధ, వీఆర్ఏలు సతీశ్, కై లాశ్, గజేందర్, వైశాలి, రజిత, అటెండర్ శోభ, పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

వెల్గటూర్: యువకులు క్రీడల్లో రాణించాలని స్తంభంపల్లి ఎంపీటీసీ పాడేటి సతీశ్ అన్నారు. స్తంభంపల్లిలో 7 స్టార్ మిత్ర బృందం ఆధ్వర్యంలో శేరి సుదర్శన్, శేరి రాజేందర్ జ్ఞాపకార్థం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పెరకపల్లి జట్టు స్తంభంపల్లి జట్టుపై విజయం సాధించింది. విజేతగా నిలిచిన టీంకు షీల్డ్‌తో పాటు రూ.20 వేలు, రన్నర్ టీంకు రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కాంపెల్లి సతీశ్, భూపెల్లి ఆనంద్, పాదం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ఆర్యవైశ్యులను ఆదుకుంటాం

మెట్‌పల్లి: నిరుపేద ఆర్యవైశ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రి అంజయ్య అన్నారు. స్థానిక వాసవీ గార్డెన్‌లో సోమవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు నెలకు రూ.500 చొప్పున పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించి ముగ్గురికి అధ్యక్షుడి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ముక్క శ్రీనివాస్, కోట శంకర్, ఎల్మి అశోక్, దొంతుల లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

చెరువుల పండుగ ఘనంగా నిర్వహించాలి



డీపీవోకు జ్ఞాపిక అందిస్తున్న అర్చకులు

సారంగాపూర్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో గురువారం నిర్వహించే చెరువుల వద్ద చెరువుల పండగను ఘనంగా నిర్వహించాలని డీపీవో దేవరాజు అన్నారు. కోనాపూర్‌లో జరుగుతున్న మన ఊరు – మన బడి పనులను పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. చెరువు కట్టలపై కట్టమైసమ్మకు మొక్కులు చెల్లించుకునే కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూడాలని కార్యదర్శులకు సూచించారు. అంతకు ముందు దుబ్బరాజన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆయన వెంట రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కోల శ్రీనివాస్, నాయకులు కొంగరి లింగారెడ్డి, తేలు రాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ

కోరుట్ల: పట్టణ శివారులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించే పద్మనాయక కల్యాణ మండప నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, డాక్టర్ సంజయ్ కుమార్, చెన్నమనేని రమేశ్ బాబు భూమిపూజ చేశారు.కల్యాణ మండప నిర్మాణానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రావు, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలకు ఎంపిక

జగిత్యాల: పట్టణంలోని ఆర్ఎన్‌టీ నగర్‌లోని న్యూ ఏస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ –11, అండర్ – 13 సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. అండర్–11 విభాగంలో విజ్ఞాన్, అండర్–13 విభాగంలో జాన్విరెడ్డి, మిత్ర ఎంపిక కాగా, పాఠశాల కరస్పాండెంట్ 'రాజిరెడ్డి, రామకృష్ణ అభినందించారు.

కరాటేలో కోరుట్ల విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల: తెలంగాణ ఓపెన్ కరాటే ఛాంపియన్, గోజుర్యు కరాటే అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కోరుట్లకు చెందిన ఒకినోవా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు 11 పతకాలు సాధించారని కోచ్ అల్లె రమేశ్ సోమవారం తెలిపారు. 2 బంగారు, 3 వెండి, 6 కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

'చెరువుల పండుగను బహిష్కరించాలి'

కథలాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న గ్రామాల్లో చెరువులు, కుంటల వద్ద నిర్వహించే సంబరాలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు గంగపుత్ర సంఘం మండల అధ్యక్షుడు కల్లెడ గంగాధర్ అన్నారు. సోమవారం కథలాపూర్‌లో నిర్వహించిన మండల గంగపుత్ర సంఘం సమావేశంలో నాయకులు మాట్లాడారు. తెలంగాణలో గంగపుత్రులను సీఎం కేసీఆర్ అవమానపరిచారని, అందుకే చెరువుల పండుగకు గంగపుత్రులం హాజరుకావొద్దని నిర్ణయించామన్నారు. సమావేశంలో గంగపుత్ర సంఘం మండల నాయకులు కల్లెడ శేఖర్, దేశవేని గంగాధర్, రాహుల్, లింగేశ్వర్, ప్రసాద్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయికల్: పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం అందించాల్సిన నాలుగు రుపాయలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జగిత్యాల డెయిరీ యూనియన్ నాయకులు బేతి రాజరెడ్డి, మడపతిరాజు, రాజ్‌కుమార్,రంజిత్ సోమవారం ఎమ్మెల్సీ కవిత ను కలిసి సమస్య వివరించారు. సమస్యను పరిష్కరిస్తామని కవిత హామీ ఇచ్చిన్నట్లు పాడి రైతులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రానికి చెందిన రావు సత్తమ్మ, దీకొండ శ్రీహరి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాలను వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వంగ వెంకటేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్తిరెడ్డి, మకిలి దాస్, అంకం సాగర్, కృష్ణ, గణేశ్ ఉన్నారు.

మాజీ ఎంపీ పరామర్శ..

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను పెద్దపల్లి మాజీ ఎంపీ బీజేపీ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు వివేక్ వెంకటస్వామి సోమవారం పరామర్శించారు. మండలంలోని పెగడపల్లి, బతికపల్లి, అయితిపల్లిలో ఆయా కుటుంబాలను కలిసి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, నాయకులు సత్యం, సూర్యనారాయణ, మల్లేశ్ యాదవ్, మోహన్ రెడ్డి, మహేశ్, బాబు, రమేశ్ ఉన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో విద్యార్థికి బహుమతి

కథలాపూర్: అవధూత దత్తపీఠం శ్రీ గణపతి సచ్చిదానందాశ్రమం మైసూర్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో కథలాపూర్‌కు చెందిన ఆమేటి శ్రీరామ్ అనే విద్యార్థి ద్వితీయ బహుమతి అందుకున్నట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద స్వామి చేతులమీదుగా శ్రీరామ్ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.